ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి ములుగు 5

ఆదివారం 11 ఆగస్టు 2024




'శిలలపై శిల్పాలు చెక్కినారు.. మనవారు సృష్టికే అందాలు తెచ్చినారు..' అని ఓ సినీ గేయ రచయిత అలనాటి తెలుగువారి శిల్ప కళా వైభవాన్ని చాటి చెప్పారు. మొక్కవోని దీక్షతో శిలను శిల్పంగా మలిచి.. ప్రపంచానికి అందించేందుకు శిల్పులు చేసిన కృషికి యునెస్కో గుర్తింపు పొందిన మన రామప్ప శిల్ప సౌందర్యమే నిదర్శనం. అంతేకాదు అనేక చరిత్రాత్మక కట్టడాలను నిర్మించిన కాకతీయుల కాలంలో శిల్పం నాట్యమాడగా.. శిల నుంచి స్వరాగాలు పలికాయట. అలాంటి అద్భుత శిలా సంపద, కళాఖండాలపై కాలక్రమంలో ప్రకృతితో పాటు దుండగులు జరిపిన దాడులతో చాలా చోట్ల ధ్వంసమైంది. రాష్ట్రంలోని ముఖ్యంగా ఓరుగల్లులోని పురాతన దేవాలయాలు, ప్రదేశాలను సందర్శిస్తే.. కొన్ని శిల్పాలు దెబ్బతిన్నట్టు.. లేదంటే వాటి అసలు ఆకృతిని కోల్పోయినట్టు అర్థమవుతుంది. అలాంటి శిల్పాల పాత రూపం చెక్కుచెదరకుండా అసలు అకృతిని ఇచ్చేందుకు చరిత్ర పరిశోధకులు శిల్పాల పునరుజ్జీవానికి శ్రీకారం చుట్టారు. చారిత్రక సంపదను యథాతథంగా ఆవిష్కరింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

Sunday SPECIAL

సజీవ శిల్పం

కాకతీయుల నాటి కళాసంపదకు పునరుజ్జీవం





- దెబ్బతిన్న శిల్పాల ఆకృతితో సిమెంట్ విగ్రహాల తయారీ
- వారసత్వ కట్టడాల్లో 4వేలకుపైగా కళాఖండాలు.. వీటిలో 100 శిల్పాలకు జీవం
- రామప్ప, వరంగల్ కోట తదితర ప్రాంతాల నుంచి సేకరణ
- చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో అడుగులు
- కాకతీయుల శిల్ప సౌందర్యాన్ని కాపాడే ప్రయత్నంలో చరిత్ర పరిశోధకులు
- జగదల్పూర్ రాజ్‌మహల్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు ప్రయత్నాలు

7



అర్హులకు అన్యాయం!

- సింగరేణి డిప్యూటేషన్, సర్ఫేస్ పనుల్లో చేతివాటం?
- గనులు, డిపార్ట్‌మెంట్లలో బినామీలదే హవా
- అధికారాలను దుర్వినియోగం చేస్తున్న ఉన్నతాధికారులు
- అర్హులను పట్టించుకోవాలని కార్మికుల ఆవేదన



కాకతీయఖని, ఆగస్టు 10: డిప్యూటేషన్, లోకల్ బదిలీల్లో సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని అర్హులైన కార్మికులకు అన్యాయం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్రక్రియలో కొందరు ఉన్నతాధికారులు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గనులు, డిపార్ట్‌మెంట్లలో సదరు ఉన్నతాధికారులు బినామీలను ఏర్పాటు చేసుకుని వారితో మంతనాలు జరుపుతున్నట్టు కార్మికులు చెబుతున్నారు. తమకున్న అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. దీంతో అర్హులకు అన్యాయం జరుగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

డిప్యూటేషన్, సర్ఫేస్ పనుల్లో అక్రమాలు

సింగరేణి భూపాలపల్లి ఏరియాలో నాలుగు అండర్‌గ్రౌండ్ గనులు, రెండు ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులు, ఏరియా ఆసుపత్రి, స్టోర్స్, వర్క్‌షాపు, తదితర డిపార్ట్‌మెంట్లలో సుమారు 5వేల మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. సీనియర్ కార్మికులు వివిధ రోగాల బారినపడి అండర్‌గ్రౌండ్‌లోకి దిగే పరిస్థితి లేని సందర్భంలో వారికి సర్ఫేస్ పనులు అప్పగించాల్సి ఉంది. కానీ అలా కాకుండా జూనియర్ కార్మికులకు ఆ పనులు అప్పగించి తమకు తీరని అన్యాయం చేస్తున్నారని అర్హులైన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఏరియాలో కొందరు అధికారులు బినామీలతో లక్షలాది రూపాయల వసూళ్లకు పాల్పడుతూ డిప్యూటేషన్, సర్ఫేస్ పనులను అనర్హులకు అప్పగించి వారి జేబులు నింపుకొంటున్నారని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు.

బినామీలను ఆశ్రయించాల్సిందే..

కొంతకాలంగా ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో బినామీల హవా నడుస్తోందని, ఏదైనా చిన్నపని కావాలన్నా.. వారి ద్వారా వెళితేనే ఆ పనులు అవుతున్నట్లు పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. క్వార్టర్ కావాలంటే.. ఒక రేటు, సర్ఫేస్ పని కావాలంటే.. మరో రేటు, అంతర్గత బదిలీలు కావాలంటే.. ఇంకోరేటు విధిస్తూ బినామీలు పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారనే చర్చ కార్మికవర్గాల్లో జరుగుతుంది. అర్హత ఏదైనా ఆమ్యామ్యాలు ముట్టజెబితే అనర్హులకు సైతం పని ఇట్టే జరుగుతుందనేది వీరిని చూస్తే అర్థమవుతుందని కార్మికులు వాపోతున్నారు.

ఉన్నతాధికారుల అధికార దుర్వినియోగం?

సింగరేణి ఏరియా భూపాలపల్లిలో పనిచేస్తున్న కొందరు ఉన్నతాధికారులు అక్రమార్జనే ధ్యేయంగా వారికున్న అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. రాజకీయ నాయకులను, కార్మిక సంఘాల నాయకుల పేర్లను అడ్డుపెట్టుకుని ఒక ఉన్నతాధికారి యథేచ్ఛగా తనకు ఇష్టం వచ్చినట్లు నిబంధనలను తుంగలో తొక్కి పనులు చేస్తున్నట్లు కార్మికులు చెబుతున్నారు. ఇటీవల ఓ కార్మికునికి కేటాయించిన క్వార్టర్‌ను తనకు దగ్గర వ్యక్తికి అప్పగించేందుకు పావులు కదిపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆనోటా.. ఈనోటా.. కార్మిక సంఘాల దృష్టికి వెళ్లడంతో సదరు అధికారిని నాయకులు ప్రశ్నించినట్టు సమాచారం. దీంతో చేసేదేం లేక ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్టు తెలుస్తోంది. పైగా ఆ వ్యక్తికి మరో క్వార్టర్‌ను గుట్టుచప్పుడు కాకుండా కేటాయించినట్లు సమాచారం. ఇదిలావుండగా సింగరేణిలో ఒక క్వార్టర్ కేటాయించాక రిటెన్మెంట్ ఇవ్వాలంటే.. కనీసం రెండు సంవత్సరాల కాల పరిమితి ఉండాలని అధికారులే చెబుతున్నారు. కానీ ఓ అధికారి

» మిగతా 8వ పేజీలో...

అలరిస్తున్న జలసౌందర్యం

బొగత వద్ద పర్యాటకుల సందడి



వాజేడు, ఆగస్టు 10: తెలంగాణ నయాగరా బొగత జలపాతం అందాలకు పర్యాటకులు ఫిదా అవుతున్నారు. ప్రకృతి ఒడిలోంచి జాలువారుతున్న జలధారలను చూసి మంత్రముగ్ధులవుతున్నారు. శనివారం బొగత జలపాతం సందర్శనకు వేలాదిగా పర్యాటకులు తరలివచ్చారు. హైదరాబాద్, హనుమకొండ, వరంగల్, ములుగు, భద్రాచలం, ఖమ్మం తదితర పట్టణాల నుంచి వచ్చిన సందర్శకులు జలపాతం వద్ద సందడి చేశారు. జలపాతం ముందు భాగంలో సెల్ఫీలు దిగుతూ మురిసిపోయారు. అయితే.. ఈత కొలనులోకి అనుమతించకపోవడంతో సందర్శకులు నిరాశ చెందుతున్నారు. వరద ప్రవాహం తగ్గినప్పటికీ అటవీశాఖ అధికారులు అక్కడి వరకు వెళ్లనివ్వడం లేదు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి

చిట్యాల, ఆగస్టు 10: అర్హులైన రైతులందరికీ షరతుల్లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు మండల రాఘవరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షుడు కోడెల సమ్మయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డులు, ఆధార్, బ్యాంకు ఖాతా పేరులో అక్షర దోషాలు, ఇతర సాకులతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. వర్షాకాలం దృష్ట్యా రైతుభరోసా ఎకరాకు రూ.15వేల చొప్పున వారి ఖాతాల్లో జయచేయాలన్నారు. ప్రమాదవాశత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రైతు కుటుంబాలకు వెంటనే ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశాడు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా నూతన కమిటీని శనివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండల రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పాతూరి రవీందర్, ఉపాధ్యక్షులుగా వేశాల సాంబయ్య, మనగంటి కుమార్, సహాయ కార్యదర్శిగా అడగాని జగన్‌మోహన్, సేంద్రియ ప్రముఖ్‌లుగా కనుకుల రాంరెడ్డి, సుభాష్‌చంద్రబోస్, కోశాధికారిగా బెల్లపుకొండ సదాశివరెడ్డి, ఇతర ప్రముఖ్‌లుగా పొన్నం అశోక్, అర్షం రాజు, సరోజనను ఎన్నుకున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 10: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని వరంగల్‌లోని ఇంతేజార్‌గంజ్ పోలీసులు శనివారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ మచ్చ శివకుమార్ కథనం ప్రకారం.. భూపాలపల్లికి చెందిన గాదె శ్రీనివాస్ హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. డిగ్రీ వరకు చదివిన శ్రీనివాస్ ఎలాంటి ఉపాధి లభించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో ఒడిశా సరిహద్దు సీలేరు ప్రాంతం నుంచి గంజాయిని అపరిచిత వ్యక్తి ద్వారా తీసుకొచ్చి వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రూ.33,250 విలువైన 1350గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరిపై దూసుకెళ్లిన ట్రాక్టర్

వృద్ధురాలి మృతి.. మరొకరికి గాయాలు



ఓదమ్మ (ఫైల్)

చిట్యాల, ఆగస్టు 10: ఇంటి ముందు కూర్చొని ముచ్చటిస్తున్న వృద్ధురాలు, మరో వ్యక్తిపై ట్రాక్టర్ దూసుకెళ్లింది. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం నవాబుపేటకు చెందిన నేరెళ్ల ఓదమ్మ (65) తన ఇంటికి టేకుమట్ల మండలం వెలిశాల నుంచి వచ్చిన బంధువు రాజయ్యతో బయట కూర్చొని మాట్లాడుతోంది. అదే గ్రామానికి చెందిన బాలుడు ట్రాక్టర్ నడుపుకుంటూ అటువైపు వచ్చాడు. ట్రాక్టర్ అదుపు తప్పి ఇద్దరిపై దూసుకెళ్లింది. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఓదమ్మను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రాజయ్యను చిట్యాల సామాజిక ఆస్పత్రిలో చేర్పారు. చికిత్స అందిస్తున్న క్రమంలో ఓదమ్మ మృతి చెందింది. ఆమె భర్త రాజపోశయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

సర్దార్ జయంతిని విజయవంతం చేయాలి

టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్



సమావేశం సందర్భంగా నినాదాలు చేస్తున్న బహుజన నాయకులు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 10: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ నాయకుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ కోరారు. పట్టణంలోని ఓ కళాశాలలో శనివారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుజన నేత సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఈనెల 18న నిర్వహించేందుకు అందరూ సిద్ధం కావాలన్నారు. బహుజనులను ఏకం చేసి నవాబులపై వీరోచితంగా పోరాటం చేసిన చరిత్ర పాపన్నదని కొనియాడారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని బహుజనులంతా ఏకమై భవిష్యత్ తరాలకు బాసటగా నిలవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల జిల్లా, పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం



సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం, ఇతర నాయకులు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 10: స్వాతంత్ర్య దినోత్సవాన్ని సందర్భంగా నిర్వహిస్తున్న హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం కోరారు. ములుగులోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఉండాలన్నారు. ఈనెల 11 నుంచి 14 వరకు బీజేపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా హర్‌ఘర్ తిరంగా కన్వీనర్లు కొత్త సురేందర్, శీలమంతుల రవీంద్రాచారి, భూక్య జవహర్‌లాల్, జినుకల కృష్ణాకర్ రావు, మండల అధ్యక్షుడు గాదం కుమార్, నాయకులు రాయంచు నాగరాజు, సూర్యదేవర విశ్వనాథ్, చల్లూరి మహేందర్, గంగిశెట్టి రాజ్‌కుమార్, రవిరెడ్డి, పాపిరెడ్డి, కృష్ణమూర్తి, భాను తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో కౌలు రైతు మృతి



రాజయ్య (ఫైల్)

గణపురం, ఆగస్టు 10: పాముకాటుకు గురై కౌలు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని చెల్పూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెప్యాల రాజయ్య(55), సులోచన దంపతులు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. రాజయ్య చెల్పూరు శివారులో మూడెకరాల కౌలు తీసుకుని ఇటీవలే నాటు వేశాడు. ఈ క్రమంలో శుక్రవారం పొలం పనులకు వెళ్లిన రాజయ్యకు సాయంత్రం పాము కాటేసింది. దీంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న క్రమంలో శనివారం ఉదయం అతడు మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు దేవరాజు, అనిల్ ఉన్నారు.

దమ్ముచక్రాల్లో పడి డ్రైవర్ మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మేడారం, ఆగస్టు 10: పొలంలో దమ్ముచేస్తుండగా ట్రాక్టర్‌తో చక్రాల్లో పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలం ఊరట్టం గ్రామ పంచాయతీ పరిధి జంపంగవాయిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. రైతులు, కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెపల్లి గ్రామానికి చెందిన బొంది కృష్ణ (40) కొత్తూరు గ్రామానికి చెందిన కడారి మహేందర్‌రెడ్డి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జంపంగవాయి వద్ద పొలంలో దమ్ము చక్రాలతో చెక్కుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి ఒడ్డు పైనుంచి పడిపోయింది. డ్రైవింగ్ సీటుపై ఉన్న కృష్ణ ఎగిరి దమ్ముచక్రాల్లో పడి మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. భార్య సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చస్తున్నట్టు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా సురేష్



భూక్య సురేష్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 10: సేవాలాల్ సేన జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా భూక్య సురేష్ నాయక్‌ను నియమించారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్ శనివారం హైదరాబాద్‌లోని జగ్జీవన్‌రావు భవనంలో జరిగిన గిరిజన మహాసభలో నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దరావత్ శారదబాబు, జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



పోలీసు అవుతా.. గుడుంబాను నిర్మూలిస్తా..



కొత్తగూడలో సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి భోజనం చేస్తున్న చిన్నారి

మానుకోట ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో చిన్నారి

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 10 : చదువుకుని పోలీసును అవుతా.. గుడుంబాను నిర్మూలిస్తానని ఓ చిన్నారి ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో తెలిపింది. దీంతో.. నీ చదువుకు పోలీసులు సహకరిస్తారని ఎస్పీ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో శనివారం నిర్వహించిన గుడుంబా బాధితులకు చేయూత కార్యక్రమానికి గంగారం మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన ఓ వితంతువు తన చిన్నారితో హాజరుకాగా.. ఎస్పీ ఆ చిన్నారితో మాట్లాడారు. పెద్దయ్యాక ఎం అవుతావని ప్రశ్నించారు. చిన్నతనంలో గుడుంబాకు బానిసై నాన్న చనిపోయాడని ఆర్థికభారంతో చదువుకోలేక పోతున్నానని, లేకుంటే చదువుకుని పోలీస్ అయ్యేదాన్ని అని ఆచిన్నారి బదులిచ్చింది. స్పందించిన ఎస్పీనువ్వు చదువుకునేందుకు పోలీసులు సహకరిస్తారని భరోసా ఇచ్చారు. తన పక్కనే కూర్చొబెట్టుకుని భోజనం చేశారు. గుడుంబాతో నాలాంటి పిల్లల చదువు దూరమై భిక్షాటన చేస్తున్నారని ఎస్పీతో చెబుతూ విలపించింది,

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్



మాట్లాడుతున్న కోటూరి మానవతారాయ్

కేయూ క్యాంపస్, ఆగస్టు 10: రాష్ట్రంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏజెన్సీ సంస్థల దోపిడీ నుంచి రక్షించి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్, టీపీసీసీ అధికారి ప్రతినిధి కోటూరి మానవతారాయ్ అన్నారు. శనివారం కేయూ క్యాంపస్‌లోని స్కాలర్స్ హాస్టల్ వద్ద నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మానవతారాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో లక్ష 45 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరంతా అవుట్ సోర్సింగ్ సంస్థల చేతుల్లో మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ తక్కువ జీతాలు చెల్లిస్తూ సకాలంలో ఇవ్వడం లేదన్నారు. అవుట్ సోర్సింగ్ సంస్థలను తక్షణమే రద్దు చేసి చట్టబద్ధమైన సంస్థను ఏర్పాటు చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన స్వర్ణయుగంలా ఉందన్నారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి రెండు లక్షల కొలువులను భర్తీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీతో అందరూ స్వర్ణయుగం రేవంత్‌రెడ్డి పాలనను భావిస్తున్నారని అన్నారు. జీవో 29 మాజీ సీఎం కేసీఆర్ తెచ్చి ఇప్పుడు మెడికల్ సీట్ల విషయంలో టీఆర్‌ఎస్ డ్రామాలు చేస్తోందని దుయ్యబట్టారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో యువతకు లాభం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ సురాసి కృష్ణ, కేయూ పరిశోధక విద్యార్థులు తాళ్ళపల్లి నరేశ్‌గౌడ్, గుండేటి సుమన్, వర్సిటీ నిరుద్యోగ జేఏసీ ఇన్‌చార్జి అభిరామ రమేశ్, పల్లె శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా ఇండిపెండెంట్ డే స్పెషల్ రైలు

కాజీపేట, ఆగస్టు 10: ఇండిపెండెంట్ డేను పురస్కరించుకుని కాజీపేట మీదుగా(07069/07070) హైదరాబాద్ - సంత్రగాచి - హైదరాబాద్ స్పెషల్ రైలు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు ఈనెల 14, 15 తేదీల్లో నడిపించనున్నారు. ఈనెల 14, 15వ తేదీల్లో హైదరాబాద్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి కాజీపేటకు 7.30 గంటలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్, జనగాం, కాజీపేట జంక్షన్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, పలాస, బుర్హంపూర్, ఖుర్దా, భువనేశ్వర్, కటక్, జైపూర్, కీయోంజార్, భద్రక్, బలసోర్, కరబ్‌పూర్ స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

25న జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 10: రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న హనుకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్న ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-9, 19 బాలబాలికల విభాగంలో వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ క్రీడాకారులను సెప్టెంబర్ మొదటి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీకి ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స'జీవ' శిల్పం!

● కాకతీయల నాటి కళాసంపదకు పునరుజ్జీవం ● దెబ్బతిన్న శిల్పాల అక్కృతితో సిమెంట్ విగ్రహాల తయారీ ● కాకతీయుల శిల్ప సౌందర్యాన్ని కాపాడే ప్రయత్నంలో చరిత్ర పరిశోధకులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయుల కాలంలో నిర్మించిన ప్రతీ కట్టడం ఓ అద్భుతమే. అందులో ప్రతీ దేవాలయాల నిర్మాణానికి ఓ ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకతే శిల్పం. ఎన్నో ఏళ్ల శ్రమించి శిల్పులు శిలలకు జీవం పోసేలా నిర్మాణం చేశారు. అందులో రామప్ప శిల్ప సౌందర్యం యునెస్కోను కట్టి పడేసింది. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారి రామప్పను ప్రపంచ వారసత్వ కట్టడంగా యునెస్కో గుర్తించింది. కేవలం రామప్పలోని శిల్ప నైపుణ్యతతో పాటు నీటిలో తేలియాడే ఇటుకల తయారీ యునెస్కోను ఘైమరిపింపజేసింది. ఆలయం చుట్టూ గోడలపై ఉన్న నాట్యకారిణులు, ఏనుగులు, మదనికల విగ్రహాలు రామప్ప ప్రత్యేకత. నల్ల గ్రానైట్ రాయిపై చెక్కిన నాగిని, మద్నిక శిల్పాలు, రంగమండప స్తంభాలు, యాళి, గజకేసరి శిల్పాలు అలనాటి కళకారుల నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచి యునెస్కో గుర్తింపునకు దోహదపడ్డాయి. కాకతీయుల కాలంలో అనేక దేవాలయాల్లో ఇలాంటి శిల్ప సౌందర్యమే భక్తులను ఆకట్టుకుంటుంది. రామప్పతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యి స్తంభాల దేవాలయం, వరంగల్ కోట, గణపశ్వేరాలయం.. ఇలా అనేక ప్రాంతాల్లో కాకతీయుల కట్టడాలున్నాయి. వీటిలో చాలా వరకు ప్రకృతి వైపరిత్యాలతో పాటు హిందూ దేవాలయాలపై జరిగిన దాడుల్లో అనేక శిల్పాలు దెబ్బతిన్నాయి. కొన్ని శిల్పాలు వాటి అక్కృతిని పూర్తిగా కోల్పోయాయి. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని కాపాడేందుకు చరిత్ర పరిశోధకులు టీమ్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ కల్చర్ అండ్ హెరిటేజ్ (టార్చ్) అనే పేరుతో అంతరించి పోతున్న చరిత్రకు జీవం పోసేందుకు కృషి చేస్తున్నారు.

శిల్పాలకు పునరుజ్జీవం..

కాకతీయుల కాలంలో కళావైభవం ఎంత వర్ధిల్లిందో.. శిల్ప సౌందర్యం కూడా అంతే ఆకర్షించింది. అయితే కాకతీయులు నిర్మించిన అనేక ఆలయాల్లోని శిల్పాలు దుండగుల దండయాత్రలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా వాటి అసలు రూపాన్ని కోల్పోయాయి. చరిత్రకు మౌనసాక్ష్యాలుగా నిలిచాయి. టార్చ్ ఆధ్వర్యంలో కాకతీయ రాజులు పరిపాలించిప్పుడు రూపొందించిన వందకు పైగా ప్రసిద్ధ శిల్పాలను గుర్తించి వాటికి మునుపటి రూపాన్ని తీసుకొచ్చేందుకు గత ఆరు నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కాకతీయ సామ్రాజ్యంలో దాదాపు 1,600 ప్రదేశాలలో అనేక దేవాలయాలు ఉన్నాయి. ఈవారసత్వ కట్టడాల్లో 4,000కుపైగా శిల్పాలున్నాయి. ఈ ప్రాజెక్టులో అరవింద్, ఈమని శివనాగిరెడ్డి (రిటైర్డ్ ఆర్కియాలజిసిస్ట్), ఏలూరి శేషబ్రహ్మం (ప్రముఖ కళాకారుడు), రఘువీర్ (స్థపతి), రక్షిత్(కళాకారుడు), హిమాని(నృత్యకారిణి) దాదాపు 100పాడైపోయిన శిల్పాలను సేకరించి స్కెచింగ్ చేసి శిల్పాలను తయారు చేయడం ప్రారంభించింది. వరంగల్ కోట, రామప్ప దేవాలయం, చంద్రవల్లి దేవాలయాలు, నాగులపాడు, కూసుమంచి, ధంతేశ్వరి నుంచి అనేక విగ్రహల నమునాలను సేకరించారు. పునరుజ్జీవ ప్రాజెక్టు కాకతీయ రాజవంశం కాలం నాటి దెబ్బతిన్న శిల్పాలను పునర్మించడం లక్ష్యంగా పెట్టుకుంది. శిల్పాలు దెబ్బతినకుండా ఉంటే ఎలా ఉంటుందో ఊహించాల్సి ఉంటుంది. ఆ కళాఖండాలను గీసి.. సిమెంట్‌లో చెక్కాల్సి ఉంటుంది. ఇలా ఇప్పటివరకు 30శిల్పాలను పూర్తి చేశారు. కాకతీయుల కాలంలో ఒక్కో శిల్పం చెక్కడానికి కనీసం ఆరు నెలల సమయం పట్టేది. కాకతీయ శిల్పాలు తమ జీవితాంతం వేలాది శిల్పాలను రూపొందించారు. కాకతీయ కట్టడాలపై జరిగిన దాడులలో ఇటువంటి అద్భుతమైన కళాఖండాలు నాశనమయ్యాయి. శిథిలావస్థకు చేరిన శిల్పాల అసలు స్వరూపంపై ఇప్పటివరకు ఎలాంటి పరిశోధనలు జరగలేదు. వీటిని ఇలా నిర్లక్ష్యం చేస్తే ఉన్నవి కూడా కనుమరుగవుతాయని చరిత్ర పరిశోధకుడు అరవింద్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

శిల్పవైభవం భవిష్యత్తు తరాలకు తెలిసేలా

చరితను గుర్తు పెట్టుకోవడానికి శాసనాలు, నాణేలు, పుస్తకాలు, జానపద కథలు లాంటి రాతపూర్వక ఆధారాలు ఉంటాయి. శిల్పాల ద్వారా చరిత్రను చూపించవచ్చని, దెబ్బతిన్న శిల్పాలు అప్పట్లో ఎలా ఉండేవో.. వాటి అసలు అక్కృతిని ప్రజలకు చూపించాలని లక్ష్యంగా శిల్ప పునరుజ్జీవం కోసం చరిత్ర పరిశోధకులు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో కాకతీయులతో పాటు అనేక మంది రాజులు నిర్మించిన కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి అనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో ఓరుగల్లు శిల్పావైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించేలా పునరుజ్జీవ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. ప్రధానంగా రామప్ప, వరంగల్ కోటలోని అనేక శిల్పాలను గుర్తించారు. వీటి అసలు అక్కృతి ఉట్టిపడేలా సిమెంట్‌తో విగ్రహలను తయారు చేస్తారు.






ఈ శిల్పాలకే పునరుజ్జీవం..

కాకతీయుల కాలంలో నిర్మించిన విగ్రహలు అనేకం ధ్వంసమయ్యాయి. వీటిలో కొన్నింటి అసలు అక్కృతితో పునరుజ్జీవం కల్పించేందుకు టార్చ్ బృందం ఎంపిక చేసింది. వీటిలో రామప్ప ఆలయంలో వందలాది నృత్య శిల్పాలు న్నాయి. పేరిణి, కోలాటంతో పాటు ఇతర శిల్పాలు, నాలుగు కాళ్లతో శివప్రియ నృత్య భంగిమ ఉంది. రంగమండపానికి ఆగ్నేయం వైపు చెక్కిన ఈ శిల్పంలో ముగ్గురు మహిళలు నాలుగు కాళ్లతో నాట్యం చేస్తున్నారు. ఈ శిల్పానికి పునరుజ్జీవం కల్పిస్తున్నారు. అలాగే రామప్ప ఆలయంలోని రంగ మంటపంపైన ఉన్న కపాలి రాతిపై మధ్యలో నటరాజ, అష్ట దిక్పాలకులతో కూడిన కళాకృతి ఉంది. దీన్ని కూడా పునరుజ్జీవం కల్పించనున్నారు. వరంగల్ కోటలోని శంభు దేవాలయంలో అరుదైన ముఖలింగంతో ఉంది. నాలుగు దిక్కులకు నాలుగు ముఖాలు చెక్కి ఉంటుంది. వారిని నద్యోజాత, వామదేవ, అఘోర, ఈశాన అని పిలుస్తారు. ఈ లింగాన్ని కూడా నమునా తయారు చేస్తున్నారు. పాలంపేటలోని రామప్ప చెరువు కట్టపై ఉన్న త్రికూట ఆలయ ధ్వజస్థంభం కాల క్రమేణా అరిగిపోయింది. దీనికి కూడా పునరుజ్జీవం తేనున్నారు. వీటితో పాటు 100 శిల్పాలకు జీవం పోయనున్నారు.



శిల్పాలను తయారుచేస్తున్న స్తపతి రఘువీర్



కాకతీయ శిల్ప వైభవాన్ని కాపాడేందుకే..

అరవింద్, టార్చ్, ప్రధాన కార్యదర్శి

కాకతీయుల కాలంలో నిర్మించిన శిల్పాలను పునఃనిర్మించటంతో పాటు సాంస్కృతిక వైభవం, వారసత్వం, కళలను కాపాడేందుకు శిల్పాల పునరుజ్జీవ ప్రక్రియను చేపట్టాం. వారసత్వ కట్టడాల్లో దెబ్బతిన్న 100 శిల్పాలను గుర్తించాం. వీటిలో 30కి పైగా శిల్పాలను పునరుద్ధరించాం. వరంగల్, హైదరాబాద్ నగరాల్లో ఈ శిల్పాలను ప్రదర్శనకు ఉంచుతాం. ఛత్తీస్‌గఢ్, జగదల్‌పూర్‌లోని కాకతీయుల వారసుడు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ రాజ్‌మహల్‌లో ప్రదర్శించనున్నాం. ఈ మహల్‌ను త్వరలోనే మ్యూజియంగా మార్చి భవిషత్ తరాలకు కాకతీయుల శిల్ప వైభవం, చరిత్రను అందేలా చూస్తున్నాం.





యథావిధిగా నడుస్తున్న రైళ్లు

శాతవాహన, గోల్కొండ, కృష్ణా, పుష్‌పుల్‌తో సహా అన్ని రన్నింగ్

ఈ నెల 5 నుంచి పోయిన రైళ్ల పునరుద్ధరణ

గిర్మాజిపేట, ఆగస్టు 10: విజయవాడ రైల్వేస్టేషన్- విజయవాడ పశ్చిమ క్యాబిన్ మధ్య కొనసాగుతున్న మూడోలైన్ పనుల కారణంగా ఈనెల 5 నుంచి నిలిచిపోయిన శాతవాహన, గోల్కొండ, కాజీపేట- డోర్నకల్- విజయవాడ పుష్‌పుల్ రైళ్లతో సహా వరంగల్ రాకుండా దారి మళ్లించిన పలు రైళ్లు శనివారం నుంచి యథావిధిగా నడుస్తున్నాయి. సికింద్రాబాద్- విజయవాడ -సికింద్రాబాద్ శాతవాహన ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్- గుంటూరు -సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ - గుంటూరు- సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు, కాజీపేట- డోర్నకల్- విజయవాడ, విజయవాడ- డోర్నకల్ - కాజీపేట పుష్‌పుల్ రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగుతున్నాయి. వరంగల్ రాకుండా దారిమళ్లించిన ఆదిలాబాద్ -తిరుపతి -ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-తిరుపతి - సికింద్రాబాద్ పద్మావతి, హైదరాబాద్ -చెన్నై సెంట్రల్- హైదరాబాద్ చార్మినార్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ -గూడూరు -సికింద్రాబాద్ సింహపురి ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లన్నీ శనివారం నుంచి వరంగల్ మీదుగా రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం తిరుపతి నుంచి ఆదిలాబాద్ బయలుదేరిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ విజయవాడ, ఖమ్మం మీదుగా సాయంత్రం 6.10గంటలకు వరంగల్‌కు చేరుకుని ఆదిలాబాద్‌కు బయలుదేరింది. దీంతో 5 రోజుల పాటు విజయవాడ, హైదరాబాద్ వైపు రైళ్ల రాకపోకలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రయాణికులకు ఊరట లభించింది.

సంగెం పీహెచ్‌సీలో అయోమయానికి తెర

ఒకరిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 10: వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఒకే పోస్టులో ఇద్దరిని కేటాయిస్తూ వెలువడిన ఉత్తర్వులను రద్దు చేశారు. వైద్య, ఆరోగ్యశాఖలో అయోమయం అనే కథనం ఈ నెల 8న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. వరంగల్ జిల్లా సంగెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్‌గా ఎం.హనుమనాయక్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు ఉత్తర్వులు విడుదల చేశారు. మరో పది రోజులకు ఇదే స్థానంలో సదానందంను నియమిస్తున్నట్లు ఆదేశాలు వెలువడ్డాయి. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురాగా సదానందంను గీసుగొండకు బదిలీ చేసినట్లు తాజా ఉత్తర్వులు విడుదల చేశారు.

నీటమునిగి బాలుడి మృతి



దేవేందర్ మృతదేహం



దేవేందర్ (ఫైల్)

మల్హర్, ఆగస్టు 10: చేపలు పట్టడానికి వాగు లోని మడుగులో దిగిన బాలుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన మండ లంలోని మల్లం పల్లిలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన మల్యాల దేవేందర్ (15) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలకు సెలవు కావడంతో స్నేహి తులతో కలిసి సమీపంలోనే ఉన్న మల్హర్ మండలం పరిధి మల్లం పల్లి శివారు బొగ్గులవాగులోని బండలమడుగు వద్దకు చేపలు పట్టడానికి వచ్చాడు. ప్రమాదవశాత్తు అందులో నీట మునిగి మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. దేవేందర్ తల్లిదండ్రులు రాజేశం, భాగ్య కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కూతురు, కుమారుడు కాగా దేవేందర్ రెండో సంతానం.

ఆన్‌లైన్ బంద్‌దైనా..

దర్జాగా ఇసుక దందా



చుంచుపల్లి క్వారీ వద్ద లారీలో లోడ్ అవుతున్న ఇసుక

మంగపేట, ఆగస్టు 10: ప్రభుత్వ నిబంధనలు, అధికారుల ఆదేశాలకు విరుద్ధంగా మండలంలోని చుంచుపల్లి శివారులో ఇసుక ఆన్‌లైన్ వ్యాపారం జోరుగా సాగుతోంది. 3, 4 చెంచులక్ష్మి ఎస్టీ ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ, చుంచుపల్లి నర్సింహస్వామి గిరిజన ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్టు పరస్పర సహాయక సహకార సంఘం క్వారీలకు చెందిన ఇసుక లోడింగ్ బంద్ చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఆన్‌లైన్‌ను అధికారులు నిలిపివేసి రెండు రోజులైనా దానిని లెక్క చేయకుండా నకిలీ వేబిల్లులు సృష్టిస్తూ, ఇసుక అధిక లోడ్‌తో నింపి పట్టణాలకు ఇసుకాసురులు తరలిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలు, ఉత్తర్వులను ధిక్కరించి ఇసుక రెజ్లింగ్ కాంట్రాక్టర్లు యథేచ్ఛగా ఇసుక కుప్పలలో యంత్రాలతో రాత్రి వేళల్లో లారీలలో లోడింగ్ చేస్తూ, ధనార్జనే ధ్యేయంగా వ్యవరిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కొందరు మండల అధికారులకు, కుల సంఘాల నాయకులకు ముడుపులు చెల్లించి ఈ దందాను దర్జాగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆన్‌లైన్ బంద్ అయినా గోదావరి నుంచి గతంలో డంపు చేసిన ఇసుకను కొందరు తమ ఇష్టానుసారంగా తరలిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని పలు ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు. పగటి వేళల్లో క్వారీల వద్ద లారీలను నిలిపివేయకుండా వాడగూడెం, రమణక్కపేటల వద్ద బూర్గంపహాడ్-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై నిలిపివేసి, ఎవరికీ అనుమానం రాకుండా రెండేసి లారీలను చీకటిపడిన తర్వాత నేరుగా తీసుకెళ్లి లారీలలో లోడింగ్ చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఇసుక కుప్పలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్రమ రవాణాను, మాఫియాను అరికట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

దండోరాను విజయవంతం చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భట్టు విజయ్

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 10: హైదరాబాద్‌లో ఈ నెల 13న జరిగే దండోరాను మాదిగలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భట్టు విజయ్‌కుమార్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 30 ఏళ్లుగా నిర్విరామ పోరాటం చేసి సాధించుకున్న వర్గీకరణ విజయోత్సవాన్ని ఘనంగా జరుపుకునేందుకు మాదిగలు హైదరాబాద్‌కు తరలిరావాలని అన్నారు. విజయంతో తిరిగి తెలంగాణకు వస్తున్న ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకాలని కోరారు. మాదిగలు, ఉపకులాలు అంతా ఏకమై డప్పుల చప్పుళ్లతో హైదరాబాద్‌ను మార్మోగించాలన్నారు.

అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలి

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 10: అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అవయవ దాన ఐక్యవేదిక ప్రతినిధులు కామిడి సతీష్‌రెడ్డి, బిల్లా రాజిరెడ్డి అన్నారు. స్థానిక ఓ కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాటాడారు. ఈ సందర్భంగా అవయవదానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో భక్తుల రద్దీ



కాళేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మహదేవపూర్, ఆగస్టు 10 : శ్రావణ మాస శనివారాన్ని పురస్కరించుకొని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి త్రివేణి సంగమ గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గోదావరి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి అభిషేకంతో పాటు పలు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం కావడంతో ఆలయంలో దక్షి పత్రి పూజలు ఎక్కువగా చేశారు. అలాగే ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున నవగ్రహ పూజలు, కాలసర్ప దోష నివారణ పూజలు నిర్వహించారు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి

మహదేవపూర్, ఆగస్టు 10 : మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద శనివారం గోదావరి మళ్లీ పెరిగింది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు తెలంగాణలో కురిసిన వానకు మానేరు నుంచి వరద, ప్రాణహిత నుంచి పెద్ద ఎత్తున నీళ్ల చేరడంతో కాళేశ్వరం పుష్కరఘాట్‌ను ఆనుకని గోదావరి పరవళ్లు తొక్కుతోంది. శనివారం అన్నింటికంటే గోదావరి రెండు మీటర్ల మేర పెరిగింది.

హేమాచల క్షేత్రంలో ప్రత్యేక పూజలు



హేమాచల ఆలయంలో మల్టీజోన్ ఐజీ తరుణ్ జోషి

మంగపేట, ఆగస్టు 10: శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా మండలంలోని ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. శనివారం సుమారు 20 వేల మంది దైవ దర్శనాలు చేసుకున్నారు. దీంతో దేవాలయం కిక్కిరిసిపోయింది. సుదూర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాలలో భక్తులు తరలివచ్చి ఆలయ ప్రాంగణంలోని చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. ఉప దేవాలయాల్లో దేవుళ్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపై కొలుతీరి స్వయంభూ పుట్టుస్వామిగా విరాజిల్లుతున్న లక్ష్మీనర్సింహస్వామిని, పక్కనే ఉన్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతలను దర్శించుకున్నారు. అర్చకులు కైంకైర్యం రాఘవాచార్యులు, ఎం.రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో స్వామివారి మూల విరాట్‌కు తిలా, తైలాభిషేకాలు జరిగాయి. గజమాల, పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దైవ దర్శనాలు చేసుకున్నారు. సంతానం లేని దంప తులను అర్చకులు పవన్‌కుమారాచార్యులు, ఈశ్వర్ చంద్‌శర్మ ఆశీర్వాచనం గావించి నాభిచందనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో అర్చకులు వెంకటనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారిని దర్శించుకున్న మల్టీజోన్ ఐజీ

హేమాచల లక్ష్మీనరసింహస్వామిని పోలీసు శాఖ మల్టీ జోన్ ఐజీ తరుణ్‌జోషీ తన మిత్ర బృందంతో కలిసి దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి గర్భాలయంలో ఐజీ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించారు. ఐఈ వెంట ములుగు ఓఎస్డీ గీతే మహేశ్ బాబా సాహెబ్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపా. ధ్యాయ, ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, మంగపేట ఎస్సై టీవీఆర్. సూరి తదితరులు ఉన్నారు.

పాలాయిగూడెంలో కార్డన్‌సెర్చ్

కన్నాయిగూడెం, ఆగస్టు 10: మండలంలోని పాలాయిగూడెం గొత్తికోయగూడెంలో ఎస్సై వెంకటేష్ నేతృత్వంలో పోలీసులు శనివారం కార్డన్‌సెర్చ్ నిర్వహిం చారు. గూడెంలో నివసిస్తున్న వివరాలు సేకరించారు. ఆధార్ తది తర గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు. అసాంఘిక శక్తులకు, మావోయిస్టులకు ఆశ్ర యం ఇవ్వ రాదని, చట్ట వ్యతిరేక కార్యకలా పాలకు పాల్పడొద్దని అన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో




వైద్య పరీక్షలు చేస్తున్న డీఎంహెచ్‌వో

తాడ్వాయి, ఆగస్టు 10: మండలంలోని పోచాపూర్ గ్రామంలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు ఆరోగ్య ఉపకేంద్రాన్ని(కంటైనర్ ఆస్పత్రి) శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపకేంద్రంలో రోగులకు, చిన్నారులకు అందుతున్న వైద్యపరీక్షల తీరును పరిశీలించారు. అదేవిధంగా తానే స్వయంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు పోచాపూర్ గ్రామంలో కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వైద్యులు, సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ గిరిజనులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, జ్వరాల నియంత్రణకు తగిన చికిత్స అందించాలన్నారు. ఆస్పత్రిలో పాముకాటు, కుక్కకాటు మందులు ఉంచడానికి ప్రయత్నిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టు వెంకటేశ్, హెల్త్ అసిస్టెంట్ సీతారాములు, ఏఎన్‌ఎంలు అనురాధ, కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 10: మండలంలోని మంగవాయి, సీతారామపురం, చినగంగారం, ముత్తారం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం వేర్వేరుగా వైద్యశిబిరాలు జరిగాయి. ఈసందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అదేవిధంగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని, దోమతెరలు వాడాలన్నారు. శిబిరాల్లో వైద్యాధికారులు పవన్, ఆశిష్, వినయ్, సత్యనారాయణ, సిబ్బంది భూపతి, మోహన్, కోటిరెడ్డి, యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న డీఆర్ సేల్స్ డిపో పైకప్పు



పెచ్చులూడిన పైకప్పు

మంగపేట, ఆగస్టు 10: మండలంలోని తిమ్మంపేట అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న డీఆర్ సేల్స్ డిపో శిథిలావస్థకు చేరుకుంటోంది. పైకప్పు పెచ్చులూడు తుండటంతో ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రతినెలా సరుకులు తీసుకోవ డానికి వచ్చే రేషన్‌కార్డు లబ్ధిదారులు భయాందోళనకు గురవుతున్నారు. పెచ్చులూడి పడటంతో పలువురు గాయపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ డిపోను మరోచోటకు తరలించాలని పలువురు కోరుతున్నారు.

కేంద్రం చిన్నచూపు తగదు

రైతు సంఘం జిల్లా కార్యదర్శి రజనీకాంత్



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నేతలు

చిట్యాల, ఆగస్టు 10: కార్పొరేట్ కంపెనీలకు పెద్దపీట వేస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల చిన్నచూపు చూడ్డం తగదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చింతల రజనీకాంత్ విమర్శించారు. మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్‌లో రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేవిధంగా బడ్జెట్ కెటాయిం చిందన్నారు. వ్యవసాయ రంగానికి అధిక నిధులు కెటాయించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు ఐదు శాతం పన్ను రాయితీ కల్పించడం దుర్మార్గ మని, వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటుపరం చేయకుండా వాటి మనుగడను కొనసాగించాలని డిమాండ్ చేశాడు. ఈకార్యక్రమంలో రైతులు మోత్కూరి రాయకొంరు, జంబుల అశోక్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు అన్యాయం!

(5వ పేజీ తరువాయి)

తనకు సన్నిహితుడైన ఓ కార్మికుడికి కాలపరిమితి పూర్తికాకముందే.. క్వార్టర్ కేటాయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


అర్హులను పట్టించుకోవాలని కార్మికుల ఆవేదన

తమకు అన్ని అర్హతలున్నా తమకు కేటాయించాల్సిన బదిలీలు, ప్రమోషన్లు, క్వార్టర్ల కేటా యింపు, సర్ఫేస్ పనులు జూనియర్లకు ఇవ్వడం పట్ల కార్మికుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. కేటీకే 6వ గనిలో పనిచేస్తున్న ఓ కార్మికుడు గ్యాస్ పరీక్ష పాసై సర్టిఫికెట్ కూడా పొందాడు. ఈ క్రమంలో సదరు కార్మికుడిని కాదని జూనియర్‌కు ల్యాంప్ రూం మజ్దూర్‌గా నియమించడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జీఎం, ఏజెంట్, గని మేనేజర్, చుట్టూ మూడు నెలలుగా తిరుగుతున్నా.. ఫలితం లేకుండా పోయిందని చెబుతున్నాడు. ఏరియాలోని ఓ గనిలో పని చేస్తున్న 59 సంవత్సరాల కార్మికుడిని కాదని, యువ కార్మికుడిని సర్ఫేస్ ఫిట్టర్‌గా నియమించడం పట్ల ఆ గనిలో తీవ్ర దుమారం రేగుతోంది. సింగరేణికి సుదీర్ఘకాలంగా సేవలు అందించిన తనకు అన్యాయం చేసి అర్హత లేని వ్యక్తికి ఇవ్వడం పట్ల తనకు తీరని ఆవేదనను మిగిల్చిందని సదరు కార్మికుడు తోటి కార్మికులతో వాపోయాడు. ఏదేమైనప్పటికి సింగరేణి డైరెక్టర్లు కల్పించుకుని తమకు న్యాయం చేయాలని సీనియర్ కార్మికులు కోరుతున్నారు.

అధికారుల అక్రమార్జనపై దృష్టిసారించాలి...

ఏరియాలోని సింగరేణి గనులు, డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న కార్మికులను ఏదో రకంగా వారి వద్ద నుంచి మాముళ్లు వసూలు చేసేందుకు గాను కొందరు ఉన్నతాధికారులు రకరకాల కుట్రలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే నేరుగా తీసుకుంటే.. తాము దొరికిపోతామని బినామీలను ఏర్పాటు చేసుకుని అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు సమాచారం. అయితే ఇలాంటి బినామీలు గనులు, వివిధ డిపార్ట్‌మెంటులలో ఉంటున్నట్లు పలువురు చెబుతున్నారు. బినామీల్లో ప్రస్తుత ఉద్యోగులతో పాటు రిటైర్డ్ ఉద్యోగులు కూడా ఉన్నట్లు సమాచారం. గతంలో ఎన్నడూజరగని విధంగా భూపాలపల్లి ఏరియాలో పైరవీలు జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. ఈ విషయమై సింగరేణి విజిలెన్స్ అధికారులు దృష్టి సారిస్తే అక్రమార్కులు దొరికి పోతారని కార్మికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సింగరేణి సీఎండీ బలరాంనాయక్ ఏరియాలో జరుగుతున్న అవకతవకలపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



జితేందర్ (ఫైల్)

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 10: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి మండలంలోని నేరుడుపల్లి (కొత్తపల్లి)లో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంగపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన మారం జితేందర్‌రెడ్డి (31) కొన్నేళ్ల క్రితం తన అమ్మమ్మ గ్రామమైన భూపాలపల్లి మండలం నేరుడుపల్లి (కొత్తపల్లి)లో నివాసం ఉంటున్నాడు. అమ్మమ్మ వాళ్లతో కలిసి ఉంటూ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. దీంతో అపస్మారక స్థితికి వెళ్లిన అతడిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. మృతుడి తండ్రి మారం దేవేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భూపాలపల్లి పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడు అవివాహితుడు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



వెంకటేశ్(ఫైల్)

మల్హర్, ఆగస్టు 10 : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కొయ్యూర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కొయ్యూర్ గ్రామానికి చెందిన చెలిమేల వెంకటేశ్(34) తన ఇంటి ఆరవణలో ఉన్న బోరు మోటార్ స్టార్టర్‌కు విద్యుత్ సరఫరా రావడం లేదని వైర్లను సర్దుతుండగా షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గొత్తికోయగూడాల్లో వైద్య శిబిరాలు



తొర్రిచింతలపాడులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 10: మండలంలోని అడవిలో ఉన్న తొర్రిచింతలపాడు, రోలుబండ గొత్తికోయగూడాల్లో శనివారం వైద్య శిబిరాలను నిర్వహించారు. వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్, సిబ్బంది ట్రాక్టర్‌పై ఎంతో శ్రమకోర్చి చేరుకున్నారు. 82 మంది గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బాలింతలు, చిన్నపిల్లలకు టీకాలు వేశారు. వర్షాకాలంలో వాగులు, వంకల్లో నీటిని తీసుకొచ్చేటప్పుడు వాటిలో పురుగులు, చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. నీటిని కాచి చల్లార్చిన తర్వాత వడబోసి తాగాలన్నారు. రాత్రిపూట దోమతెరలు వాడాలని, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ శిబిరాల్లో హెచ్‌వీ పుష్పకుమారి, ఏఎన్‌ఎంలు అనురాధ, స్వప్న, వజ్రమ్మ, ఆశా కార్యకర్తలు సరోజన, మాధవి, సౌజన్య, కవిత, ఇందిర, సంపూర్ణ, పాషా తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి'

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 10: మండలంలో భారతీయజనతాపార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు అట్లూరి రఘురాం పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రైతురుణమాఫీ అమలు చేయాలని, రైతుభరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామపంచాయతీల్లో పార్టీ అభ్యర్థులను పోటీలో ఉంచేలా పాటుపడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈసమావేశంలో నాయకులు సాధనపల్లి విజయ్‌కుమార్, తోట సతీష్, హేమసుందర్, నోముల కిషన్, మాటూరి ముత్తయ్య, శ్రీను, లక్ష్మీపతి, రాజు, కుంజ నరేంద్ర, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 10: వెంకటాపురం మండలకేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ సోవది వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. మండలకేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. విద్యారంగం బలోపేతం కోసం గోండ్వాన సంక్షేమపరిషత్ ఆధ్వర్యంలో త్వరలో సెల్ఫ్ మేనేజ్‌మెంట్ హాస్టళ్లను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఈసమావేశంలో నాయకులు పూనెం సాయి, ప్రతాప్, వెంకటకృష్ణ, రేగ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వాడబలిజ సేవా సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

వాజేడు, ఆగస్టు 10: వాడబలిజ సేవా సంఘం జగన్నాథపురం గ్రామ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు డర్రా దామోదర్, రాష్ట్ర అధికార ప్రతినిధి తోట మల్లికార్జునరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గురి రమణయ్య సమక్షంలో ఎన్నికల జరిగింది. జగన్నాథపురం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రొడ్డ అశోక్, కార్యదర్శిగా కుప్ప సురేష్, కోశాధికారిగా సుగంధపు లీలాప్రసాద్, అధికార ప్రతినిధిగా బొల్లె కామేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పానెం మూర్తి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రొడ్డ డ్యానితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గార నాగార్జునరావు, ఉపాధ్యక్షుడు సుగంధపు సాంబశివరావు, నాయకులు ఆదినారాయణ, కొప్పుల రఘుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

తాడ్వాయి, ఆగస్టు 10: మండల వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లయితే పూర్తిస్థాయిలో నేరాలను నియంత్రించవచ్చని స్థానిక ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని 18గ్రామపంచాయతీలకుగాను 16 గ్రామపంచాయతీల్లో గ్రామస్థుల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం మండలకేంద్రంతోపాటు కామారం, కాటాపూర్, దామెరవాయి, నర్సాపురం, తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. మిగతా గ్రామాల్లో రెండురోజుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు తమకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. ఆయనవెంట కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ సిద్దిరెడ్డి, మాజీ సర్పంచ్ ఇరుప సునీల్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడి కుటుంబానికి మధు పరామర్శ



నివాళులర్పిస్తున్న పుట్ట మధు

కాటారం, ఆగస్టు 10: మండలంలోని ధర్మసాగర్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తోట ముత్తయ్య తల్లి బానక్క ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పెద్దపల్లి మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధు శనివారం పరామర్శించారు. ముత్తయ్యతో పాటు కుటుంబ సభ్యులను పుట్ట మధు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వై రాష్ట్ర నేత జక్కు రాకేష్, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, డివిజన్, మండల నాయకులు బాసాని రవి, మందల లక్ష్మారెడ్డి, నరివెద్ది శ్రీనివాస్, తైనేని సతీష్, తోట శ్రీనివాస్, మానెం రాజబాపు, చిట్యాల సమ్మయ్య, దుర్గారావు, కొండపర్తి రవి, రాజు, మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ డే



పామాయిల్ మొక్కలు నాటుతున్న డీహెచ్‌ఎస్‌వో

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 10: వెంకటాపూర్(రామప్ప) మండలం లింగాపూర్‌లో జిల్లా ఉద్యాన శాఖ, కేఎన్ బయోసైన్స్ ఆధ్వర్యంలో శనివారం మెగా ప్లాంటేషన్ డే నిర్వహించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి అనసూయ, సిబ్బంది మొక్కలు నాటారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని ఆమె అన్నారు. తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడి సాధించొచ్చని, ఆయిల్ పామ్ సాగుకోసం ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వో శ్రీకాంత్, కేఎన్ బయోసైన్స్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆసరా

ఇల్లు నిర్మించి ఇస్తున్న స్వచ్ఛంద సంస్థ



ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అయిలి మారుతి

చిట్యాల, ఆగస్టు 10: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన పిల్లలకు ఓ స్వచ్ఛంద సంస్థ ఆసరా కల్పించేందుకు సంకల్పించింది. గత ఏడాది భారీ వర్షాలకు వారు ఉంటున్న నేలమట్టం కావడంతో నిల్వ నీడను కల్పిస్తోంది.

మండలంలోని పాశిగడ్డతండా గ్రామానికి చెందిన గిరిజనులు భూక్య సురేష్, వసంత దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. సురేష్ ఏడేళ్ల క్రితం, వసంత మూడేళ్ల క్రితం మృతి చెందారు. దీంతో నలుగురు చిన్నారులు తిరుపతి, లక్ పతి, సంజన, రాజేష్ అనాథలుగా మిగిలారు. స్థానికులు, బంధువుల సహాయంతో జీవనం కొనసాగిస్తున్నారు. గత ఏడాది భారీ వర్షాలకు వీరు ఉంటున్న ఇల్లు నేలమట్టమైంది. ఈ విషయాన్ని గ్రామస్థులు, వివిధ పత్రికల ద్వారా తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ సభ్యులు ఆ బాలలకు కొత్త ఇల్లు నిర్మించేందుకు ముందుకొచ్చారు. పాశిగడ్డతండాలోని ఆ చిన్నారుల సొంత స్థలంలో ఇల్లు నిర్మించేందుకు ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి శనివారం భూమి పూజ చేశారు. త్వరలోనే ఇంటి నిర్మాణం పూర్తి చేయిస్తామని తెలిపారు. ఈకార్యక్ర మంలో ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి లావుడ్య రాజునాయక్, ప్రధాన కార్యదర్శి బల్ల శ్రావణ్, చింతకింది రాజు, శీలం అనీల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాటారానికి బీసీ సంక్షేమ బాలుర గురుకులం

త్వరలోనే పెద్దపల్లి జిల్లా నుంచి తరలింపు

కాటారం, ఆగస్టు 10: కాటారం మండలానికి మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులం ఎట్టకేలకు మండల కేంద్రానికి రానుంది. 2018లో మంజూరైన బీసీ సంక్షేమ గురుకులానికి కాటారంలో సరైన వసతి సౌకర్యాలు గల భవనం అందుబాటులో లేకపోవడంతో పెద్దపల్లి జిల్లా మంథని మండలం వెంకటాపూర్‌లో 2019లో ప్రారంభించారు. వేరే శాఖకు చెందిన పాత భవనంలో గురుకులం కొనసాగుతోంది. గత ఏడాది నుంచి భవనం శిదిలావస్థకు చేరడంతో విద్యార్థులు భయందోళనలతో తాము ఉండలేమని నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అధికారులు గురుకులాన్ని రామగుండానికి మార్చడానికి యత్నించారు. విషయం తెలిసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి కాటారం మండలకేంద్రానికి బీసీ గురుకులాన్ని తరలించాలని ఆదేశించారు. కాటారం మండల కేంద్రంలో గతంలో ఓ ప్రైవేట్ విద్యా సంస్థను నడిపిన భవనం ఖాళీగా ఉండటంతో దానిని అద్దె ప్రాతిపదికన తీసుకుని జ్యోతిబాపూలే గురుకులాన్ని నడిపించడానికి చర్యలు చేపట్టారు. భవన యజమానులు యుద్ధప్రాతిపదికన అదనపు టాయిలెట్లు, మరమ్మతులు చేపిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ రోజున కాటారంలోనే గురుకులం జాతీయ జెండా ఎగరేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం. దీంతో కాటారం బీసీ బాలుర గురుకులం ప్రస్తుతం ఉన్న 165 మంది విద్యార్థులతో స్థానికంగా నిర్వహణ కొనసాగనుంది. అనంతరం పూర్తి స్థాయిలో గురుకులంలో సీట్ల భర్తీ జరగనుందని అధికారులు తెలిపారు.

గుడుంబా విక్రేతల అరెస్టు

వాజేడు, ఆగస్టు 10: గుడుంబా అమ్ముతున్న వారిపై వాజేడు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్సై రుద్రారపు హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో గుడుంబా అమ్ముతున్నారనే సమాచారం మేరకు శనివారం దాడులు నిర్వహించగా కుర్సం సీత, మడప తులసి, చెన్నం నర్సయ్య, కుర్సం పద్మ, కుర్సం మనమ్మ పోలీసులు చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారిని పట్టుకొని సుమారు 55లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.